ప్రయత్నిస్తే గెలుపు మనదే

- భయం వీడండి.. ముందడుగు వేయండి
- పర్వతారోహకురాలు మాలావత్ పూర్ణ
- మాట గొప్పది...ఏదైనా చేయగలదు : మాజీ ఐఎఎస్ రమణాచారి
- ఘనంగా ప్రారంభమైన బాలోత్సవం పిల్లల జాతర

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తొలి అడుగే విజయానికి నాంది అని, భయం వీడి ప్రయత్నిస్తే విజయం మనదే అవుతుందని పర్వతారోహకురాలు మాలావత్ పూర్ణ నొక్కి చెప్పారు. బాల్యం ఎంతో కీలకమైనదనీ, ప్రతి ఒక్కరూ లక్ష్యం పెట్టుకుని ముందుకు సాగాలని చిన్నారులకు పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద బాలోత్సవం ఆధ్వర్యంలో పిల్లల జాతర మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారులు, మాజీ ఐఎఎస్ కెవి రమణాచారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. చిన్నవయస్సులోనే 24 గ్రంథలయాలను ప్రారంభించి పుస్తకాలను సొంతంగా అందజేస్తున్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని ఆకర్షణ సతీశ్ బాలోత్సవం జెండాను ఎగురవేశారు. అనంతరం జరిగిన ప్రారంభ సభలో ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ పాడిన 'నీతో నీవు మాట్లాడుకో..' అన్న పాట ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బాలాచారి, బిఎస్‌సిపిఎన్ కంపెనీ చైర్మన్ రాఘవయ్య, ఎల్ఐసి ప్రతినిధి సుబ్రమణ్యం, భారత్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, బాలోత్సవం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎన్ సోమయ్య, ఉపాధ్యక్షులు సుజావతి, కోశాధికారి బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభ సభలో మాలావత్ పూర్ణ మాట్లాడుతూ...తొలుత ట్రెక్కింగ్ మొదలు పెట్టినప్పుడు చాలా భయమేసిందని, అతి పేద కుటుంబం నుంచి వచ్చిన తాను ఎలాంటి అవకాశాన్ని వదులుకోవద్దనే పట్టుదలతో ఒక్కో మెట్టును అధిగమిస్తూ 13 ఏళ్ల వయస్సులోనే ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించగలిగానని తన ఎదుగుదల ప్రస్థానాన్ని పిల్లలకు వివరించారు. ఆ తర్వాత అన్ని ఖండాల్లోని అతి ఎత్తయిన శిఖరాలను అధిరోహించానని గర్వంగా చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా తెలంగాణలోని భువనగిరి కోటపైనా, ఏపిలో గండికోటపైనా ట్రెక్కింగ్‌లో వేలాది మంది చిన్నారులకు శిక్షణ అందజేస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ లక్ష్యాన్ని పెట్టుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తన ఎదుగుదలతో తల్లిదండ్రులు, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, కోచ్ శేఖర్‌బాబు కృషి, ప్రోత్సాహం చాలా కీలకమైందని, వారిని జీవితంలో ఎప్పటికీ మర్చిపోనని తెలిపారు.

బాలోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాలావత్ పూర్ణ

ఆకర్షణ సతీశ్ మాట్లాడుతూ కరోనా కాలంలో తనకు ఎదురైన అనుభవాలు, పుస్తకాలు లేక పేద పిల్లలు పడుతున్న ఇబ్బందులను చూసిన తర్వాత కలిగిన ప్రేరణతో గ్రంథాలయాలు స్థాపించే పని మొదలు పెట్టాననీ, ఈ విషయంలో నాన్న ప్రోత్సాహం మరువలేనిదని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, గిరిజన గ్రామాలు, పోలీస్ స్టేషన్లు, జువైనల్ హోమ్స్, రైల్వే స్టేషన్లలో ఇప్పటి వరకూ 24 లైబ్రరీలను ప్రారంభించానని తెలిపారు. తాను మెట్రో రైల్వే స్టేషన్లో ప్రారంభించబోయే గ్రంథాలయ కార్యక్రమానికి ప్రధాని మోడీ రాబోతున్నారని చెప్పారు. పిల్లల్లో మానసిక ఎదుగుదలకు పుస్తక పఠనం ఎంతో కీలకమని నొక్కి చెప్పారు. పుస్తకాలు చదవడం ద్వారా జ్ఞానం, ఊహాత్మక శక్తి పెరుగుతాయన్నారు.

రమణాచారి మాట్లాడుతూ... రిటైర్డ్ ఐఎఎస్ ఎస్ఆర్ శంకరన్ చిత్రపటాన్ని ఎవరెస్టు శిఖరంపై పూర్ణ ప్రదర్శించడం గొప్ప విషయమనీ, పేదల ఐఎఎస్‌గా పేరుపొందిన ఎస్ శంకరన్ శిష్యుడిగా ఈ విషయంలో గర్వపడుతున్నానని చెప్పారు. ప్రతి ఒక్కరు కూడా చిన్న వయస్సు నుంచే పూర్ణ మాదిరిగా లక్ష్యాలను పెట్టుకుని ముందుకు సాగాలని పిల్లలకు పిలుపునిచ్చారు. సాధించాలనే ఆశయం, కోరిక లేకపోతే జీవితం వ్యర్థమని స్పష్టం చేశారు. చిన్నప్పటి నుంచే ప్రతి విషయాన్ని తర్కించే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. తాను చిన్న వయస్సులో ప్రతి దానిపైనా ప్రశ్నలు వేసుకుంటూ సమాధానాలు రాబట్టుకుంటూ ముందుకు సాగడం వల్లనే ఈ స్థాయికి ఎదిగానని వివరించారు. మాట కీలకమని, మాట తీరు బాగుంటే మనం ఉన్నత స్థాయికి ఎదుగుతామని చెప్పారు.

రాఘవయ్య మాట్లాడుతూ...జీవితంలో ఇది లేదు..అది లేదు అని కూర్చోకుండా, ఇతరులతో పోల్చుకోకుండా మనకంటూ ఒక లక్ష్యాన్ని పెట్టుకుని ప్రతి అడుగూ ఉత్సాహంతో ముందుకేయాలని పిల్లలకు పిలుపునిచ్చారు. వేలాది చిన్నారుల మధ్య జరుగుతున్న ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందనీ, ఇంత మంచి కార్యక్రమాలు చేస్తున్న బాలోత్సవం కమిటీని అభినందిస్తున్నానని చెబుతూనే ఎల్లవేళలా సహకరిస్తానని హామీనిచ్చారు.

బాలోత్సవంలో పిల్లల సందడి..

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బాలోత్సవం అట్టహాసంగా ప్రారంభమైంది. పిల్లల సందడితో ఆ ప్రాంతమంతా శోభను సంతరించుకుంది. నాలుగు గోడల మధ్య బందీలుగా ఉండే విద్యార్థులంతా స్వేచ్ఛా ప్రపంచంలోకి వచ్చినట్టుగా సందడి చేశారు. పిల్లలు తమ ఆటపాటలు, ప్రతిభాపాటవాలు, సృజనాత్మక ప్రదర్శనలతో వీక్షకులను ఆకట్టుకున్నారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో పెట్టిన ప్రాజెక్టు వర్కులు, పిల్లలు వివరించే తీరు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నాయి. మత్తు పదార్థాలు-కుటుంబాలపై ప్రభావం అనే అంశంపై చిత్రలేఖనం, సెల్‌ఫోన్- ఎఐ వల్ల కలిగే నష్టాలు అనే అంశంపై వ్యాస రచన, మత్తు పదార్థాలు అనర్థాలు అనే అంశంపై కథారచన పోటీల్లో పలువురు విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. జానపద, శాస్త్రీయ నృత్యాలు, వెస్టన్ డ్యాన్సులు, దేశభక్తి గేయాల ఆలాపన, బతుకమ్మ, దాండియా ప్రదర్శనల్లో పిల్లలు ఆస్తకిగా పాల్గొన్నారు. ఆయా విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

పత్తి కొనుగోళ్ల బంద్

- తాత్కాలికంగా వాయిదా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పత్తి కొనుగోళ్లలో కేంద్ర ప్రభుత్వ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) అవలంబిస్తున్న కొత్త నిబంధనలను నిరసిస్తూ గురువారం నుంచి తలపెట్టిన కొనుగోళ్ల బంద్ వాయిదా పడింది. ఎల్-1, ఎల్-2, ఎల్-3 కేటగిరీలలో అలాట్‌మెంట్ కపాస్, యాప్ రిజిస్ట్రేషన్, తేమ శాతం పరిమితి వంటి ఇబ్బందికర నిబంధనలను సడలించాలని డిమాండ్ చేస్తూ నిర్ణయించిన నిరవధిక బంద్‌ను వాయిదా వేసుకోవాలన్న సర్కార్ విజ్ఞప్తి మేరకు పత్తి కొనుగోళ్ల బంద్‌ను తాత్కాలికంగా విరమిస్తున్నట్టు తెలంగాణ కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రకటించింది. జిన్నింగ్ ఇండస్ట్రీస్ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్నదని వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేంద్రమోహన్ ప్రకటించారని తెలిపింది. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌తో ఫోన్‌లో మాట్లాడితే సానుకూలంగా స్పందించారని.., బీహార్ ఎన్నికల్లో బిజీగా ఉన్నందున తొందర్లోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని ప్రిన్సిపల్ సెక్రెటరీ తెలిపినట్టు అసోసియేషన్ నాయకులు పేర్కొంటున్నారు. సమస్యలు పరిష్కారం కాకపోతే మళ్లీ బంద్‌కు వెళ్తామని హెచ్చరించారు.

12 శాతం మ్యాచర్ రాదు..

సిసిఐ నిబంధనల ప్రకారం పత్తిని కొనుగోలు చేయాలంటే 12 శాతం లోపు తేమ ఉండాలి. నిత్యం కురుస్తున్న వర్షాలు.. ఎండ తక్కువగా ఉండటంతో పత్తిని ఆరబోసినప్పటికీ తేమశాతం 12 శాతం లోపు రావడం లేదని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కపాస్ యాప్‌లో స్లాట్ బుక్ తీసుకున్న తర్వాత పత్తిని ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తెచ్చినా.. సిసిఐ అధికారులు పరిశీలించి తేమ ఎక్కువ ఉందని కొనుగోలు చేయడం కుదరదని తేల్చి చెప్తున్నారు. కాటన్ మిల్లుల వద్ద ప్రతిరోజూ 50 నుంచి 60 వాహనాలు వస్తున్నప్పటికీ అందులో నలుగురికి మాత్రమే తేమ 12 శాతంలోపు ఉంటుంది. తేమశాతం ఎక్కువగా ఉందని వెనక్కి పంపడం ద్వారా అదనంగా రవాణా ఖర్చులు మీద పడటంతో పాటు సమయం వృథా అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తేమశాతం రావడం లేదని కొనుగోలు చేయడం లేదు
రైతు జడల రవి- తుమ్మలగూడెం, నార్కట్‌పల్లి మండలం

రెండు నెలల కిందట పత్తిని ఏరి ఎండలో ఆరబెట్టాం. కపాస్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుని చౌడంపల్లి గ్రామ శివారులో ఉన్న వరలక్ష్మి కాటన్ మిల్లుకు పత్తిని తీసుకెళ్తే.. 22 శాతం తేమ ఉందని సీసీఐ అధికారులు కొనుగోలుకు నిరాకరించారు.

ప్రజావ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలు

26న జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు : పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మికులు, కర్షకులు ఐక్యంగా పోరాడాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 26న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో జరిగే ప్రదర్శనలను విజయవంతం చేయాలని కోరారు. మహబుబాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం సిఐటియు అధ్యక్షులు ఆకుల రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆఫీసు బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం లేబర్‌కోడ్‌లు తెచ్చి శ్రమదోపిడీకి పాల్పడుతోందని, పంటలకు గిట్టుబాటు ధరలు చెల్లించకుండా రైతాంగాన్ని మోసగించిందని అన్నారు. ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచి బడ్జెట్‌లో నిధులు తగ్గించిందని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనాలు, సౌకర్యాలు అమలు చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉపాధి హామీ పనిదినాలు పెంచాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం మతోన్మాద శక్తులకు, బడా కార్పొరేట్ సంస్థల యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. శ్రామికవర్గ వ్యతిరేక విధానాలపై రానున్న కాలంలో మరిన్ని ఐక్య పోరాటాలకు కార్మికులు, కర్షకులు సిద్ధం కావాలని చెప్పారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను దొడ్డిదారిన అమలు పరిచేందుకు నూతనంగా "శ్రమశక్తి నీతి 2025" పేరుతో లేబర్ పాలసీ ప్రకటించిందని తెలిపారు. "కేంద్ర ప్రభుత్వ లేబర్ పాలసీ - కార్మిక వర్గంపై ప్రభావం" అనే అంశంపై నేడు(శుక్రవారం) జిల్లా కేంద్రంలోని జగన్నాథం భవనంలో సెమినార్ జరుగుతుందని తెలిపారు. ఈ సెమినార్‌లో సిఐటియు జాతీయ కోశాధికారి ఎం సాయిబాబు పాల్గొంటారని, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి, జిల్లా ఆఫీసు బేరర్స్ కందునూరి శ్రీనివాస్, సమ్మెట రాజమౌళి, దుండి వీరన్న, కుమ్మరికుంట్ల నాగన్న, పోతుగంటి మల్లయ్య, చింతా మౌనిక, ధార స్నేహబిందు, ఏసుమళ్ల సంపూర్ణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

దీర్ఘకాలిక రోగాలపై అవగాహన పెంచుకోండి

- గ్రూప్-1 ఆఫీసర్లకు శుభాకాంక్షలు : మంత్రి దామోదర

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఇటీవలి కాలంలో సీజనల్ వ్యాధులు తగ్గుముఖం పట్టాయనీ, అదే సందర్భంలో దీర్ఘకాలిక వ్యాధుల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వాటిపై మరింత అవగాహన పెంచుకుని ముందుకెళ్లాలని వైద్యారోగ్య శాఖలో నూతనంగా విధుల్లో చేరిన గ్రూపు-1 అధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ హితబోధ చేశారు. నూతన అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రిని నూతనంగా నియమితులైన గ్రూపు-1 అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆరోగ్యశాఖలో పనిచేసే అవకాశం దక్కడం తమ అదృష్టమనీ, అనారోగ్యంతో ఆపదలో ఉన్న ఎంతోమందికి సేవ చేసే అవకాశమున్న ఈ శాఖలో పోస్టు రావడం సంతోషంగా ఉందని నూతన అధికారులు తెలిపారు. ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ప్రజల్లో మరింత నమ్మకాన్ని పెంచేలా, నాణ్యమైన వైద్య సేవలు అందించేలా పనిచేయాలని నూతన అధికారులకు మంత్రి సూచించారు.

బిఎస్ఎ థండర్‌బోల్ట్ ఆవిష్కరణ

హైదరాబాద్ : ప్రీమియం బైకుల తయారీ కంపెనీ బిఎస్ఎ కొత్తగా తన అడ్వెంచర్ బైక్ 'థండర్‌బోల్ట్'ను ఆవిష్కరించింది. అంతర్జాతీయ మోటార్ సైకిల్ ప్రదర్శన ఎకిమాలో దీనిని ప్రదర్శించింది. 334 సిసి సింగిల్ సిలీండర్ లిక్విడ్ కూల్డ్ ఇంజిన్, 15.5 లీటర్ల ఇంధన ట్యాంక్ సామర్థ్యంతో అందుబాటులోకి తెచ్చామని బిఎస్ఎ మాతృసంస్థ క్లాసిక్ లెజెండ్స్ కో ఫౌండర్ బోమన్ ఇరానీ పేర్కొన్నారు.

చిన్న నిర్లక్ష్యమూ లేకుండా కలిసికట్టుగా పనిచేయాలి

- జూబ్లీహిల్స్‌పై సమీక్షలో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక విషయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా లేకుండా ప్రతిఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సూచించారు. గురువారం హైదరాబాద్‌లోని ఎంపి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, అందుబాటులో ఉన్న మంత్రులు పాల్గొన్నారు. ఇప్పటికే మంత్రులు, సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు గడపగడప తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. సిఎం రేవంత్‌రెడ్డి సైతం గత నెల 31, ఈనెల ఒకటి, నాలుగు, ఐదు తేదీల్లో నియోజకవర్గంలోని పలు డివిజన్లలో రోడ్‌షోలు నిర్వహించడంతోపాటు కార్నర్ సమావేశాలు నిర్వహించారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో, క్షేత్రస్థాయి పరిస్థితులు, సర్వే నివేదికలు, పార్టీ నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాలు, ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలు, వ్యూహ, ప్రతివ్యూహాలు తదితర అంశాలపై సమీక్ష చేసినట్టు తెలిసింది. మొత్తం మంత్రులందరికీ బాధ్యతలు అప్పగించిన సీఎం, ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలనీ, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలని దిశానిర్దేశం చేసినట్టు సమాచారం.

సిఎం స్థాయిలో తొలిసారి

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను రాష్ట్ర ప్రభుత్వం సీరియేస్‌గా తీసుకుంది. సాధారణంగా ఉప ఎన్నికల ప్రచారానికి సిఎం స్థాయిలో ప్రచారం చేయలేదు. రేవంత్‌రెడ్డి మాత్రం పలుమార్లు కార్నర్ మీటింగ్‌లు, ఇతరాల పేర పలుమార్లు నియోజకవర్గంలో కాలు పెట్టారు.

మంత్రులకు సైతం ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇస్తూ కార్యాచరణ ఇస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు కావస్తున్నది. త్వరలో రెండో ఏడాది ప్రజా విజయోత్సవాలు సైతం ఘనంగా నిర్వహించాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం ప్రత్యేకంగా కమిటీనీ సైతం ఏర్పాటు చేసింది. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజల దృష్టికి తీసుకుపోవాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర స్టార్‌క్యాంపెయినర్లకు చెబుతున్నారు. దీన్ని ప్రభుత్వ పరిపాలనకు రెఫరెండమ్‌గా భావిస్తున్నట్టు సమాచారం. ఇక్కడ తేడా వస్తే ఢిల్లీలో ఇబ్బందులు వచ్చే అవకాశాలు ఉన్నాయని సీఎంతోపాటు మంత్రులూ భావిస్తున్నట్టు గాంధీభవన్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ఈ తరుణంలో కాలుకుబలపం కట్టుకుని ప్రచారంలో తిరుగుతున్నారు. గతంలో ముఖ్యమంత్రులు ఎవరూ ఉప ఎన్నికల ప్రచారానికి రాలేదు. కేవలం ఒకే ఒక్క బహిరంగసభకు వచ్చి ప్రచారం చేసి వెళ్లిపోయేవారు. ఇప్పుడు బిఆర్ఎస్ అధినేత జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బాధ్యతను కేటీఆర్‌కు అప్పగించారు. ఇంతవరకు కేసీఆర్ ప్రచారానికి రావడం లేదు. ఈనెల 11 పోలింగ్ ఉన్న విషయం విదితమే. తొమ్మిదో తేదీ వరకే ప్రచారం చేయడానికి అవకాశం ఉంది. ఇంకా రెండు రోజులే బహిరంగ ప్రచారం మిగిలుంది. ఎన్నికకు నాలుగు రోజులుంది. ఈ నేపథ్యంలో ఆయా ప్రయివేటు సంస్థల సర్వేలు, ఇతర ఏజెన్సీల నుంచి నివేదికలు తెప్పించుకు ఇటు సిఎం రేవంత్, అటు ప్రతిపక్ష నేత కెసిఆర్ తమ బలాబలాలు బేరీజువేసుకుంటున్నట్టు సమాచారం. కాంగ్రెస్ సర్కారుకు ఇది సవాల్ కానుంది. గత పదేండ్లుగా బిఆర్ఎస్ సర్కారు జూబ్లీహిల్స్‌ను పట్టించుకోలేదని కాంగ్రెస్ నేతలు ప్రచారంలో ఓటర్లకు వివరిస్తున్నారు. హైదరాబాద్‌ను నిర్లక్ష్యం చేశారంటూ ఆరోపణలు, విమర్శలకు దిగుతున్నారు. తాము అధికారంలోకి వచ్చాక ప్రతియేటా నగరాభివృద్ధికి రూ. 10 వేల కోట్లు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నామని చెబుతున్నారు. ఇదిలావుండగా బీఆర్ఎస్ మరోలా ప్రచారంయుద్ధం చేస్తున్నది. తాము ఐటిని భారీస్థాయిలో అభివృద్ధి చేశామని బిఆర్ఎస్ నేతలు చెప్పుకుంటున్నారు. కాంగ్రెస్ తరపున యువ నేత నవీన్‌యాదవ్, బిఆర్ఎస్ తరపున మాగంటి సునీత మధ్య బరి ఆసక్తికరంగా మారింది. దేశవ్యాప్తంగా ఈ ఎన్నిక పట్ల ఆసక్తి నెలకొంది.

శ్రీదేవసేనపై విమర్శలు సరికాదు

- తెలంగాణ ఐఎఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యాశాఖ ఇన్‌ఛార్జి కార్యదర్శి శ్రీదేవసేనపై ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య నాయకులు చేసిన వ్యాఖ్యలను తెలంగాణ ఐఎఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు అసోసియేషన్ చేసిన తీర్మానాన్ని అధ్యక్షులు కె రామకృష్ణారావు గురువారం విడుదల చేశారు. ఆ అధికారిణిని వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని తక్కువ చేస్తూ అణగదొక్కేలా చేసిన వ్యాఖ్యలు సివిల్ సర్వీసెస్ గౌరవాన్ని కించపరిచేవిగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఆ వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవనీ, ఆమోదనీయం కానివని, హానీ కలిగించేవని అభిప్రాయపడ్డారు. ప్రతి స్థాయిలో సివిల్ సర్వెంట్స్ అంకితభావం, నిష్పక్షపాతం, చిత్తశుద్ధి, కొన్ని సందర్భాల్లో వ్యక్తిగత త్యాగాలతో తమ విధులను నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు.

హైటెక్స్‌లో 25 నుంచి పౌల్ట్రీ ఎక్స్‌పో

హైదరాబాద్ : దక్షిణాసియాలోనే అతిపెద్ద పౌల్ట్రీ ఈవెంట్‌ను నవంబర్ 25 నుంచి మూడు రోజులపాటు హైటెక్స్‌లో నిర్వహించనున్నట్లు ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్మెంట్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ తెలిపింది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బయాస్ మాట్లాడుతూ.. ఈ 17వ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పోను 'వన్ నేషన్ వన్ ఎక్స్‌పో' అనే థీమ్‌తో ఏర్పాటు చేస్తున్నామన్నారు. నవంబర్ 25న నోవోటెల్ లో నాలెడ్జ్ డేతో ఈ ఈవెంట్ ప్రారంభమవుతుందని అన్నారు. ఇందులో 1,500కి పైగా ప్రతినిధులు, 7కు పైగా అంతర్జాతీయ నిపుణులు పాల్గొంటారని అంచనా వేశారు. సస్టైనబుల్ ఫీడ్ సొల్యూషన్స్, ఆటోమేషన్, పౌల్ట్రీ వ్యాధులు, ఎరువుల నిర్వహణ, భవిష్యత్ ఉద్యోగావకాశాలు వంటి ముఖ్యమైన అంశాలపై చర్చిస్తారని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ కు 50 దేశాల నుంచి 500కిపైగా ఎగ్జిబిటర్స్, 40,000కుపైగా సందర్శకులు పాల్గొంటారని అంచనా వేశారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT :: TIRUPATI
S.O.P.No.12 OF 2024
(In the matter of India Succession Act)
Between:
Smt. Korivi Dakshayani wife of Korivi Sridhar, Hindu aged about 48 years House wife, residing at Door No.8-185, Pot No.40, New Balaji Colony, Tirupati Town and urban Mandla. ...Petitioner
AND
...Respondent
1. The State Bank of India Baskar Rao Nagar Branch, Sec-bad. ...(Respondent No. 1)
2. Smt. Korivi Ramanjari W/o of Srinivas Rao, Hindu aged about 54 years, residing at Flat No.104, Rakshith Classif Orcade Defense colony, Sainikpuri, Secunderabad. (Respondent No.3)
To notice is hereby given that the above named petitioner has filed a petition seeking the grant succession certificate. The respondents 1 and 3 having any objection to the issuance of the said succession certificate in favour of the petitioner are hereby required to appear before this Hon'ble court in person or through an advocate on **24-11-2025** at **10.30** am. In default of your appearance on the day before mention the S.O.P will be herd and determined in your absence
("By order of the Court")
S. VINUTHA, ML, MA, MSW, ADVOCATE TIRUPATI
Cell : 9849047416

ప్రకటన
మహారాజశ్రీ 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), ఏలూరు
I.A.No.141/2024 in O.S.No.538/2022
Between:
హర్షిత్ తాళం ...Plaintiff
మరియు
1. పెన్మత్స వెంకట కోట సత్య సాయి హనుమ సుబ్బరాజు (died)-(D-1)
2. వెజ్జెల @ పెన్మత్స కళ్యాణి, 41 F W/o. లేటు. పెన్మత్స వెంకట కోట సత్య సాయి హనుమ సుబ్బరాజు (R-2)
3. పెన్మత్స హాసిని సాయి వర్మ, 14 F D/o. లేటు. పెన్మత్స వెంకట కోట సత్య సాయి హనుమ సుబ్బరాజు (R-3)
C/o. వెజ్జెల విజయకుమార్, ప్లాట్ నెం.302, సాయి నిలయం, ప్రగతి నగర్, కూకట్‌పల్లి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, తెలంగాణ స్టేట్. ...రెస్పాండెంట్స్ R-2, R3
పై నెంబరు దావాలో నా క్లయింట్ అయిన Plaintiff D-1 నుండి రావలసిన బాకీ సొమ్ము గురించి దావా వేయగా D-1 చనిపోయినారు. D-1 కి R-2 భార్య, R-3 కూతురు అయి ఉన్నారు. R-2, R-3 ని LR గా చేర్చి పిటీషను I.A 141/2024 వెయ్యుటలో 170 రోజులు ఆలస్యం అయినందున బేటా కట్టగా మీకు అందనందున ఈ ప్రకటన ఇవ్వడమైనది. మీ వాయిదా **ది. 28-11-2025 న కోర్టు వారి నందు అయి ఉన్నది. మీరు ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియజేసుకోగలరు. లేనిచో మీ పరోక్షముగా కోర్టు వారు తీర్మానము చేసెదరు.
॥ కోర్టు వారి అనుమతితో ॥
Chode SRINIVAS, Advocate, Eluru, Eluru Dt, A.P
Eluru
Dt. 28-10-2025
Cell: 92908 22001

IN THE COURT OF THE ADDL. JUNIOR CIVIL JUDGE : PENUKONDA
O.S.No: 296/2024
Between:
Vaddi Ganganna ...Plaintiff
AND
K.Nagaraja Rao & others ...Defendants
Summon to Defendant's No:1 to 3 and D5 to D10
D1: K.Nagaraja Rao S/o Late K.Padmanabha Rao, 72 years, D.No:4-132. Panchangam Street, Penukonda (M).
D2: K.Krishna Rao S/o Late K.Padmanabha Rao, 73 years, D.No:4-131. Ramamandiram street, Penukonda(M).
D3: K.Vasantha Rao S/o. Late, K. Padmanabha Rao, 70 years D.NO.13-183-B-3-1, Kasapuram Road, vijayanagar colony, Guntakal (M), Ananthapuram (dt)
D5: K.Sai Charan S/o K. Sathyanarayana Rao, 28years, D.NO. 10273, Vasantha para colony, Near Ganesh Tenple, Malkajgiri Secunderabad Telangana state
D6: K.Lakshmi Neelama D/o K.Sathyanarayana Rao, 22 Years, D.NO. 10273, Vasantha para colony, Near Ganesh Temple, Malkajgiri Secunderabad Telangana state
D7: K.Neeraja W/o Late K.Badranath, 68 years, DNO. 10273, vasantha para colony, Near Ganesh Temple, Malkajgiri Secunderabad Telangana state
D8: K.Sandeep S/o Late K. Badrinath, D.NO. DNO. 10273, vasantha para colony, Near Ganesh Temple, Malkajgiri Secunderabad Telangana state
D9: K.Balaji Rao S/o Late Sreenivasa Rao, D.NO. 10273, vasantha para colony, Near Ganesh Temple, Malkajgiri Secunderabad Telangana state
D10: K.Sreekanth S/o Late Sreenivasa Rao, D.NO. 10273, vasanthapara colony, Near Ganesh Temple, Malkajgiri Secunderabad Telangana state
ఇందుమూలముగా మీకు తెలియజేయడం ఏమనగా పై దావాలో మీకు ఎన్నిసార్లు సమన్లు పంపించిన మీరు తీసుకోకుండ కాలయాపన చేయుచున్నారు. మీ హాజరు నిమిత్తం పై దావా 21-11-2025వ తేదీన వాయిదా వేసినారు. కావున 21-11-2025వ తేదీన పై కోర్టులో ఉదయం 10-30 గంటలకు ఖుద్దునగాని వకీలు ద్వారా గానీ హాజరై అక్షేపణలు తెలుపుకొనవచ్చును. లేనిచో మీ పరోక్షముగా తీర్మానించెదరు.
(By order of the court)
Md.ASIF,
Advocate, Penukonda,
Sri Sathya Sai (Dt), Andhra Pradesh (St)

IN THE COURT OF THE XXIV ADDL. CITY CIVIL & SESSIONS JUDGE AT BENGALURU
O.S. No. 1119/2021 (CCH-06)
Between : Sri Clarence Menon S/o. late R. Rajgopal @ Cyril Rajgopal Menon, Aged about 53 years, R/at No.64, B.Narayanapura, Bangalore-560 016. ...Plaintiff
And : Smt. Florence Raj Menon & Others: ...Defendants
ISSUE SUMMONS/NOTICE TO THE DEFENDANTS No. 2 TO 5 IN THE ABOVE CASE
2. Mrs. Pearl Loretto Marion, D/o. late R. Rajgopal @ Cyril Rajgopal Menon, Aged about 48 years, R/at No. 169, Whitefiled Road, Soundarya Apartment, Bangalore-560 066.
3. Sri Fredrick Fernandez S/o. Percy John Fernandez, Aged about 71 years, **4. Smt. Maurin Fernandez,** W/o. Fredrick Fernandez, Major, **5. Sri Richard Fernandez** S/o. Fredrick Fernandez, Major, The Defts. No. 3 to 5 is R/at No. G-3, Block-B Sri Lekha Apartment Officers Colony, Ramakrishna Puram, Turumalagiri, Hyderabad-500 056.
WHEREAS, the plaintiff hereby instituted the above case against the defendants viz., Mrs. Florence Raj Menon & 4 Others, seeking for the relief of Partition, separate possession and other consequential relief/s in respect of suit schedule property in O.S. No. 1119/2021 before the Additional City Civil Judge at Bangalore (CCH-6). You are hereby summoned to Defendants No.2 to 5 to appear before this Hon'ble Court in person/s or by a pleader **on 25.11.2025 at 11.00 a.m.** to answer the same, failing which the plaint / application will be disposed off on ex-parte.
SCHEDULE
All that piece and parcel of the Site bearing No. 5, HASB Khatha No. 510/1/A, now having BBMP Khatha No. 510/1/A 05, measuring East to West 40 ft. and North to South 30 ft., situated at Doddanekkundi Village, K.R. Puram Hobli, H.A.S.B. Area, Bangalore South Taluk, presently comes within the limits of BBMP, Ward No.85, Bangalore and bounded on: East by : House Site No. 13, West by : Road, North by : 15 ft. Road, South by : Property No.04.
Given under my hand and seal of the Court on this the 29th day of October 2025.
By order of the Court, Senior Sheristedar, City Civil Court, Bengaluru.
Advocate for Plaintiff :
V. Vishwanath & Mahan .S, Advocates
Having O/at No. 16, Fof-401, 4th Floor, Victory Avenue Building, K.G. Road, Bengaluru - 560 053.

IN THE COURT OF THE ADDL. JUNIOR CIVIL JUDGE : PENUKONDA
O.S.No: 298/2024
Between:
Vaddi Hanumantharayudu ...Plaintiff
AND
K.Nagaraja Rao & others ...Defendants
Summon to Defendant's No: D1,D7 to D10
To,
D1: K.Nagaraja Rao S/o Late K.Padmanabha Rao, 72 years, D.No:4-132. Panchangam Street, Penukonda (M).
D7: K.Neeraja W/o Late K.Badranath, 68 years, DNO. 10273, vasantha para colony, Near Ganesh Temple, Malkajgiri Secunderabad Telangana state
D8: K.Sandeep S/o Late K. Badrinath, D.NO. DNO. 10273, vasantha para colony, Near Ganesh Temple, Malkajgiri Secunderabad Telangana state
D9: K.Balaji Rao S/o Late Sreenivasa Rao, D.NO. 10273, vasantha para colony, Near Ganesh Temple, Malkajgiri Secunderabad Telangana state
D10: K.Sreekanth S/o Late Sreenivasa Rao, D.NO. 10273, vasantha para colony, Near Ganesh Temple, Malkajgiri Secunderabad Telangana state
ఇందుమూలముగా మీకు తెలియజేయడం ఏమనగా పై దావాలో మీకు ఎన్నిసార్లు సమన్లు పంపించిన మీరు తీసుకోకుండ కాలయాపన చేయుచున్నారు. మీ హాజరు నిమిత్తం పై దావా 21-11-2025వ తేదీన వాయిదా వేసినారు. కావున 21-11-2025వ తేదీన పై కోర్టులో ఉదయం 10-30 గంటలకు ఖుద్దునగాని వకీలు ద్వారా గానీ హాజరై అక్షేపణలు తెలుపుకొనవచ్చును. లేనిచో మీ పరోక్షముగా తీర్మానించెదరు.
(By order of the court)
Md.ASIF,
Advocate, Penukonda,
Sri Sathya Sai (Dt), Andhra Pradesh (St)

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No : 731/2022
కె.బాలరంగయ్య అలియాస్ కోళ్ళి బాలరంగయ్య ..వాది
ఎదిరి
మనవపాటి వెంకటేశ్వర్లు ..ప్రతివాది
ప్రతివాది వివరములు
మనవపాటి వెంకటేశ్వర్లు తండ్రి సుబ్రహ్మణ్యం, హౌస్ నెం 4-12/59/1, హిమాజీ నగర్ కాలనీ, సంతోష్ డాబా దగ్గర, గండంగూడా గ్రామము, గండిపేట్ మండలం, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం, పిన్ - 500091
పైనెంబరు దావా O.S.No.731/2023 పైన కనబర్చిన అడ్రస్ కు సదరు దావాలో శ్రీ కోర్టు వారు ఎన్ని పర్యాయములు దావా సమన్లు పంపిన మీరు కావలయుననే ఉద్దేశపూర్వకంగా సమన్లు తీసుకొనక కాలయాపన చేస్తున్నందున సదరు దావాలో నీ పై కోర్టు వారు 18-11-2025వ తేదీన వాయిదా వేసియున్నారు. కావున మీరు పై తేదీన ఉదయం గం 10.30 నిమిషాలకు మీరు స్వయముగా గానీ లేదా మీ వకీలు ద్వారా గానీ కోర్టుకు హాజరయ్యి మీ అక్షేపణలు ఉన్న యెడల పైవాయిదా తేదీన తెలియజేసు కొనవలెను. అట్లు తప్పిన యెడల మీ పై కోర్టువారు సదరు దావాను పరోక్షంగా విమర్శించి తీర్మానించెదరని ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.
// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
ఇట్లు
దాసరి సంగీతరావు,
వాది తరుపు న్యాయవాది,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
ఆంధ్ర ప్రదేశ్
సెల్ నెం. 9849832808

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No : 732/2022
కె.బాలరంగయ్య అలియాస్ కోళ్ళి బాలరంగయ్య ..వాది
ఎదిరి
మనవపాటి వెంకటేశ్వర్లు ..ప్రతివాది
ప్రతివాది వివరములు
మనవపాటి వెంకటేశ్వర్లు తండ్రి సుబ్రహ్మణ్యం, హౌస్ నెం 4-12/59/1, హిమాజీ నగర్ కాలనీ, సంతోష్ డాబా దగ్గర, గండంగూడా గ్రామము, గండిపేట్ మండలం, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం, పిన్ - 500091
పైనెంబరు దావా O.S.No.732/2023 పైన కనబర్చిన అడ్రస్ కు సదరు దావాలో శ్రీ కోర్టు వారు ఎన్ని పర్యాయములు దావా సమన్లు పంపిన మీరు కావలయుననే ఉద్దేశపూర్వకంగా సమన్లు తీసుకొనక కాలయాపన చేస్తున్నందున సదరు దావాలో నీపై కోర్టు వారు18-11-2025వ తేదీన వాయిదా వేసియున్నారు. కావున మీరు పై తేదీన ఉదయం గం 10.30 నిమిషాలకు మీరు స్వయముగా గానీ లేదా మీ వకీలు ద్వారా గానీ కోర్టుకు హాజరయ్యి మీ అక్షేపణలు ఉన్న యెడల పై వాయిదా తేదీన తెలియజేసు కొనవలెను. అట్లు తప్పిన యెడల మీ పై కోర్టువారు సదరు దావాను పరోక్షంగా విమర్శించి తీర్మానించెదరని ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.
// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
ఇట్లు
దాసరి సంగీతరావు,
వాది తరుపు న్యాయవాది,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
ఆంధ్ర ప్రదేశ్
సెల్ నెం. 9849832808

డ్రగ్స్ ఓవర్ డోస్‌తో యువకుడు మృతి

- రాజేంద్రనగర్ పిఎస్ పరిధిలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డ్రగ్స్ ఓవర్ డోస్‌తో ఓ యువకుడు అపస్మారక స్థితిలోకి వెళ్లి ప్రాణం కోల్పోయాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతబస్తీ కాలాపత్తర్ ప్రాంతానికి చెందిన అహ్మద్ (24), కర్నూలు జిల్లాకు చెందిన ఓ యువతి శివరాంపల్లి కెన్ వరత్ అపార్ట్‌మెం ట్‌లో కో రిలేషన్‌లో ఉంటున్నారు. బుధవారం రాత్రి డ్రగ్స్ కొనుగోలు చేసి ఇద్దరూ తీసుకున్నారు. డ్రగ్స్ ఓవర్ డోస్ కావడంతో అహ్మద్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడంతో ఆ యువతి ఆస్పత్రికి తరలించింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇద్దరికి డ్రగ్స్ పరీక్ష నిర్వహించగా.. ఇద్దరూ డ్రగ్ తీసుకున్నట్టు తేలింది. అహ్మద్ ఆస్పత్రిలో పరిస్థితి విషమించి మృతి చెందారు. పోలీసులు యువతిని అదుపులోకి తీసుకొని.. డ్రగ్స్ ఎక్కడ కొనుగోలు చేశారనే సమాచారాన్ని సేకరిస్తున్నారు. అహ్మద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు రాజేందర్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంపాదకీయం రాయడంలో చాకచాక్యం ఉండాలి : కెవి రమణ

ప్రజాశక్తి కల్చరల్

వాస్తవిక విషయాలు చెబుతూ కత్తి లాంటి నిజాన్ని తీవ్రత లేనీ గాయం చేసే విధంగా సంపాదకీయం రాయడానికి చాక చక్యం వుండాని ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె వి రమణ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై జి వి ఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ నిర్వహణలో త్యాగరాయ గానసభ సౌజన్యంతో సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు రచించిన సంపాదకీయ సంపుటి ప్రకాశ కిరణాలు ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా సంపుటి ఆవిష్కరణ చేసి మాట్లాడారు. సంపాదకుడు నిబద్ధత నియతితో పనిచేసేవారు జీవితంలో సంపాదన ఉండదని అన్నారు. పొత్తూరి సుబ్బారావు ప్రతి అంశాన్ని విశ్లేషణతో సమతూకంతో రాసారని చెప్పారు. అధ్యక్షత వహించిన సమైక్య ఆంధ్రప్రదేశ్ సమాచార హక్కుల చట్టం పూర్వ చైర్మన్ పి విజయబాబు మాట్లాడుతూ లక్షలు ధనం ఖర్చు కావొచ్చు కానీ క్షరము కానిది అక్షరమని, అలాంటి అక్షరాలతో పొత్తూరి సుబ్బారావు సంపాదకీయ మాలలు అల్లారని అభినందించారు. సంపాదక వృతి కత్తి మీద సాము వంటిదని అన్నారు. పలు ఆరోపణలు ఎదుర్కొంటూ పత్రికకు ఆత్మైన సంపాదకీయాలు రాయడం సులువు కాదని చెప్పారు. నేటి నిజం ప్రతిక సంపాదకుడు బైస దేవదాసు మాట్లాడుతూ చిన్న పత్రికల సంపాదకులకు స్వేచ్ఛ వుంటుందని, చాలా పెద్ద పత్రికలలో అలా వుండటం సాధ్యం కాక పోవచ్చని అన్నారు.

పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడొద్దు
- ఫీజులను విడుదల చేయకుంటే చలో హైదరాబాద్ చేపడతాం : టి నాగరాజు

అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఆరేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న డా.బిఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట గురువారం ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు కండ్లకు గంతలు కట్టుకుని నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 23 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. ఆరేళ్ల నుంచి సుమారు రూ.ఎనిమిది వేల కోట్లకు పైగా ఫీజు బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత పారదర్శకంగా, దశల వారీగా విడుదల చేస్తామని ఇప్పటి వరకు కనీసం ఇచ్చిన టోకెన్ల నిధులు కూడా ఇవ్వలేదన్నారు. విద్యాసంస్థల యజమాన్యాలు సమ్మె ప్రకటించి ఏడాది కాలంగా పోరాడితే రూ.1200 కోట్లు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం.. హామీ మరిచిందని అన్నారు. కాలేజీ యాజమాన్యాలు విద్యార్థుల నుంచి బలవంతంగా ఫీజు వసూలు చేస్తున్నాయని తెలిపారు. పేద ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ తరగతుల విద్యార్థులపై లక్షలాది రూపాయలు చెల్లించాలని తీవ్ర ఒత్తిడి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు భరోసా ఇచ్చేలా ఫీజుల చెల్లింపు కోసం జీవో ఇచ్చి వారి భవిష్యత్ నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిగా సిఎం రేవంత్ రెడ్డి ఉన్నారని, పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి ఈ నెలలో పూర్తి బకాయిలను విడుదల చేయాలని, లేకపోతే 'చలో హైదరాబాద్' కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యావ్యవస్థపై సిఎం రేవంత్ రెడ్డికి అవగాహన లేకపోవడం వల్లే విద్యారంగం ఆగమవుతోందని అన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలు, డైట్, కాస్మోటిక్ చార్జీలు, ఫీజు బకాయిలు సకాలంలో చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. వెంటనే విద్యారంగ సమస్యలపై రివ్యూ నిర్వహించి నిధులు విడుదల చేయాలని, రాష్ట్ర యూనివర్శిటీలలో డైట్ చార్జీలు, యూనివర్శిటీల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు లెనిన్, జె రమేష్, హైదరాబాద్ జిల్లా నాయకులు నాగేందర్, రజనీకాంత్, కైలాస్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వికారాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు తేజ మాట్లాడుతూ.. తక్షణమే విద్యార్థులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలని, లేదంటే మంత్రులను, ఎమ్మెల్యేలను అడ్డుకుంటామని హెచ్చరించారు. పరిగి పట్టణ కేంద్రంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అంబేద్కర్ విగ్రహం ఎదుట కండ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు.

రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోండి

- సిఇఒ సుదర్శన్‌రెడ్డికి బిఆర్ ఎస్ నేతల ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ముస్లింలపై దాడులు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఆయన చేస్తున్న ప్రయత్నాలను, చౌకబారు మాటలను పరిశీలించాలని కోరారు. ఈ మేరకు సిఇఒ సుదర్శన్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లో శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూధనాచారితోపాటు ఇతర నాయకులు కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఓడిపోతుందన్న భయంతో, ఆ తర్వాత తన పదవికి గండం ఉంటుందన్న ఆందోళనతో రేవంత్‌రెడ్డి చౌకబారు వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్‌కు ఓటేస్తే పథకాలు రద్దవుతాయంటూ ప్రజలను బెదిరిస్తున్నారని అన్నారు. రెండేండ్ల కాంగ్రెస్ పాలన వల్ల ప్రజల్లో వ్యతిరేకత పెల్లుబికుతున్నదని చెప్పారు. కల్లుతాగిన కోతిలా ప్రవర్తిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఉప ఎన్నిక జరుగుతున్న నియోజక వర్గం పరిధిలో సమావేశం పెట్టి, హామీలిచ్చి ప్రజలను మభ్యపెట్టడమనేది ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అని అన్నారు. ఈ ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా ఈసీ చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులతోపాటు అధికార యంత్రాంగం కూడా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని వివరించారు. అధికార బలాన్ని అడ్డం పెట్టుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రతిపక్ష పార్టీ సభలను విచ్ఛిన్నం చేసి, అధికారి పార్టీ సభలను మాత్రం విజయవంతం చేసుకుంటున్నారని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు షకీల్ ఇంటికి కాంగ్రెస్ నాయకులు వెళ్లి బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. జై తెలంగాణ అని అనని రేవంత్‌రెడ్డి ముమ్మాటికీ తెలంగాణ ద్రోహి, శత్రువు అంటూ మండిపడ్డారు. ఆయనకు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఇది పేరుకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక మాత్రమే కానీ నాలుగు లక్షల మంది ఓటర్లున్నారని వివరించారు. స్థానిక పోలీసులు, డిసిపిలు, ఎసిపిలు, రమేష్ నాయక్ అనే పోలీసు అధికారి ఎవరి కనుసన్నల్లో, ఎవరి ప్రయోజనాల కోసం, ఎవరికి తొత్తుగా పని చేస్తున్నాడో తెసుసన్నారు. ఖాకీ బట్టలకు సమాజంలో ఉండే ప్రతిష్టను ఆయన దిగజారుస్తున్నారని అన్నారు. సెంట్రల్ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసులను పంపాలని కోరారు.

ఈ ఎన్నికతో రేవంత్‌రెడ్డికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందన్నారు. ఆయనకు జీవితంలో మరోఎన్నిక చూసే పరిస్థితి ఉండక పోవచ్చని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయమైందని మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. ఓ రౌడీకి, లేడీకి మధ్య ఎన్నికలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగే అవకాశముందన్నారు. సెంట్రల్ పారా మిలటరీ దళాలను దింపాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలను మోసం చేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే షకీల్ అన్నారు. మైనార్టీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నదని చెప్పారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌లో చేరని బిఆర్ఎస్ ముస్లిం నేతలపై పథకం ప్రకారమే దాడులు జరుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పల్లె రవికుమార్, రామచంద్రునాయక్‌తోపాటు పలువురు ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో మల్లు లక్ష్మి

ఐద్వా జాతీయ మహాసభ విజయవంతానికి ఇంటింటి ప్రచారం

- సామ్రాజ్యవాదం, మనువాదంపై సంఘటితంగా ఉద్యమించాలి : మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో జనవరిలో జరగనున్న ఐద్వా 14వ జాతీయ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 23వ వార్డులో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. సామ్రాజ్యవాదం, మనువాదానికి వ్యతిరేకంగా పోరాడుతూ మహిళలు హక్కులు సాధించుకోవాలని ఆమె సూచించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మహిళా హక్కులపై దాడి చేస్తూ చట్టాలను నిర్వీర్యం చేస్తోందన్నారు. అన్ని రంగాల్లోనూ చురుకైన పాత్ర పోషిస్తున్న మహిళలను ఇంటికే పరిమితం చేయాలని మనువాద ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. మనువాదం మహిళలకు స్వేచ్ఛ లేకుండా బానిసలుగా తయారు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు సామాజికంగా, ఆర్థికంగా సమానత్వాన్ని కల్పించి అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. మీడియాలో స్త్రీలను,అశ్లీలత,అసభ్యకరంగా చిత్రీకరించడంపై ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. మహిళలపై జరుగుతున్న హింస, దాడులు, దౌర్జన్యం, హత్యలకు వ్యతిరేకంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు హైదరాబాద్‌లో జరగనున్న జాతీయ మహాసభ వేదిక కానుందని తెలిపారు. ఈ మహాసభకు దేశవ్యాప్తంగా వెయ్యి మంది ప్రతినిధులు హాజరవుతున్నట్టు చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారి హైదరాబాద్‌లో జరుగుతున్న జాతీయ మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల జ్యోతి, జిల్లా కోశాధికారి మేకనబోయిన సైదమ్మ, నాయకులు గుడిపూరి లక్ష్మీ, సునంద, సుమలత, సంపూర్ణ, శైలజ, ఉషారాణి పాల్గొన్నారు.

రైతాంగాన్ని ఆదుకోవాలి

- మంత్రి తుమ్మలకు తెలంగాణ రైతు సంఘం వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇటీవలి కాలంలో అకాల వర్షాలతో పంటలను నష్టపోయిన రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. రాష్ట్రంలో పంటల కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని కోరింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి జంగారెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ నాయక్, తదితరులు వినతిపత్రాన్ని అందజేశారు. అకాల వర్షాలతో వరి, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గ్రామాల వారీగా సర్వే చేసి పంటల నష్టాన్ని అంచనా వేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వానికి పంటల నష్ట వివరాలను పంపి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆహార పంటలకు ఎకరాకు రూ.25 వేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. పత్తి కనీస మద్దతు ధర రూ.8110 ఉండగా..ప్రయివేటు వ్యాపారులు రూ.ఆరు వేలకు లోపే కొనుగోలు చేస్తున్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తేమ శాతంతో నిమిత్తం లేకుండా సిసిఐ ద్వారా పత్తి కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మృత్యువాత పడ్డ గొర్రెలను చూసి వాపోతున్న కాపరులు

విషాహారం తిని 150కు పైగా గొర్రెలు మృత్యువాత

- సుమారు రూ.30 లక్షల నష్టం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరి పొలాల్లో మేతకు వదిలిన గొర్రెలు విషాహారం తిని 150కు పైగా మృత్యువాతపడ్డాయి. దీంతో కాపరుల జీవితాలు రోడ్డుపడ్డాయి. ఈ ఘటన నల్లగొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రం సమీపంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని అన్నారం, అనంతారం, దోసపాడు గ్రామాలకు చెందిన ఉప్పునూతల సైదులు, శ్రీరాముల కోటయ్య, శ్రీరాముల గోపాలు, ఆవుల కోటయ్య, ఆవుల వెంకన్న తమ గొర్రెలను కొన్ని రోజులుగా మండల కేంద్రం సమీపంలోని మడికట్ల (వరి కోసిన పొలాలు)లో మేపుతున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి 80 గొర్రెలు, గురువారం 70 గొర్రెలకు పైగా మృత్యువాతపడ్డాయి. పొలాల్లో చెల్లాచెదురుగా అక్కడక్కడా పడిపోయాయి. వాటి విలువ సుమారు రూ.30 లక్షలకు పైగా ఉంటుంది. కంటికి రెప్పలా కాపాడుకున్న గొర్రెలు కళ్ల ఎదుటే చెల్లాచెదురుగా పడిపోయి విగతజీవులుగా మారడంతో కాపరులు కన్నీరు మున్నీరవుతున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

గొర్రెలను పరిశీలించిన వెటర్నరీ జెడిఎ

వెటర్నరీ జెడిఎ జివి రమేష్, ఎడిఎ జూలకంటి వెంకటరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని గొర్రెలను పరిశీలించారు. గొర్రెలను చనిపోవడానికి కారణాలను కాపరులను అడిగి తెలుసుకున్నారు. రక్త నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. విష ఆహారంగానీ, విషపు నీరు వల్లగానీ మృత్యువాతపడి ఉండొచ్చని ప్రాథమిక అంచనా వేశారు. వారి వెంట వెటర్నరీ వైద్యులు అశోక్, జ్ఞానేశ్వర్ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

చీమల ఫోబియాతో ఓ వివాహిత ఆత్మహత్య

- కూతురు జాగ్రత్త అంటూ సూసైడ్ నోట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ చీమలు నన్ను బతకనివ్వు.. నేను వెళ్లిపోతున్నా.. పాపను బాగా చూసుకోండి అంటూ ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన గురించి గురువారం అమీన్‌పూర్ సిఐ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలకు చెందిన చిందం శ్రీకాంత్, మనీషా (25) దంపతులు, వారి మూడేళ్ల పాప అనికాతో కలిసి అమీన్‌పూర్ మున్సిపాల్ పరిధిలో నవ్య కాలనీలో నివాసముంటున్నారు. అయితే, మనీషా చిన్నప్పటి నుంచి చీమలకు భయపడే మైర్మెకోఫోబియా అనే వ్యాధితో బాధపడుతుంది. ఈ నెల 4వ తేదీ సాయంత్రం శ్రీకాంత్ డ్యూటీకి వెళ్లాక.. మనీషా ఇంట్లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శ్రీకాంత్ ఇంటికి వచ్చేసరికి బెడ్ రూమ్ డోర్ పెట్టి ఉంది. ఎంత పిలిచినా లోపలి నుంచి స్పందన లేకపోవడంతో స్థానికుల సహకారంతో డోర్ తెరిచారు. మనీషా ఉరేసుకుని కనిపించింది. అదే రూమ్‌లో నోట్ బుక్‌లో 'ఈ చీమలతో బతకడం నా వల్ల కావట్లేదు.. కూతురు అన్వి (4) జాగ్రత్త' అని రాసిపెట్టి ఉంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని స్వస్థలం మంచిర్యాలకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అమీన్‌పూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృత్యు శకటాలుగా మారుతున్న టిప్పర్లు

- బస్సును ఢీకొన్న టిప్పర్ బ్యాతోల్ క్వారీ నుంచి వెళ్లిందే..
- కంకర క్వారీల టిప్పర్ల ప్రమాదాల్లో అమాయకులు బలి
- వాహనాలను తనిఖీ చేయని ఆర్‌టిఎ
- ఆ ప్రమాదంతో మేలుకున్న అధికారులు
- తనిఖీలో 14 టిప్పర్ల సీజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కంకర క్వారీల నుంచి మైనింగ్ వ్యాపారులు లాభాలే ధ్యేయంగా టిప్పర్లకు ఓవర్ లోడ్ చేసి యథేచ్ఛగా తిప్పుతున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. సంగారెడ్డి జిల్లాలోని లక్దారం, బ్యాతోల్, మెదక్, సిద్దిపేట జిల్లాల పరిధిలో మైనింగ్ మాఫియా విచ్చలవిడిగా బరితెగిస్తోంది. ఒక్కో టిప్పర్ సామర్థ్యం 30 టన్నులు ఉండగా, వారు ఏకంగా 60 టన్నుల వరకు కంకర, డస్ట్‌ను ఓవర్ లోడ్ చేసి తరలిస్తున్నారు. ఈ అధిక లోడు వల్ల టిప్పర్ యజమానులకు రెట్టింపు ఆదాయం సమకూరడంతోపాటు డీజిల్, లేబర్ ఖర్చులు కలిసి వస్తున్నాయి. వేబిల్లు ప్రకారం అనుమతించిన బరువుతో సరఫరా చేస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. కానీ, రెండు ట్రిప్పుల్లో వెళ్లాల్సిన లోడ్‌ను నిబంధనలను తుంగలో తొక్కి ఒక ట్రిప్పులోనే నింపి తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఇదే సమయంలో హడావిడిగా టిప్పర్లను నడిపిస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు. అధికంగా లోడ్ చేసి అధికారుల కంట పడకుండా వెళ్లాలని టిప్పర్ల డ్రైవర్లను యజమానులు ఆదేశించడంతో విపరీతమైన వేగంతో దూసుకుపోతూ తరచూ ప్రమాదాలకు కారకులవుతున్నారు. టిప్పర్లతో వరుసగా జరుగుతున్న ప్రమాదాలను నివారించాల్సిన ఆర్‌టిఎ అధికారులు పట్టీపట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు.

పటాన్‌చెరు రూరల్ పరిధిలోని లక్దారంలో భారీగా క్రషర్లను ఏర్పాటు చేసేందుకు మైనింగ్ మాఫియా ప్రజాభిప్రాయ సేకరణలను సైతం తప్పుదోవ పట్టించింది. తమకు అనుకూలంగా ఉన్న ఎన్జీవోలు, స్వచ్ఛంద సంస్థలను రంగంలోకి దింపి క్రషర్లను ఏర్పాటు చేశారు. దీనికంతటికీ మైనింగ్ అధికారులు క్వారీల యజమానులతో కుమ్మక్కై వారిచ్చే ముడుపులకు ఆశపడి పర్యవేక్షించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

బ్యాతోల్ క్వారీ అధిక లోడ్ టిప్పర్‌తోనే బస్సు ప్రమాదం..

చేవెళ్ల పరిధి మీర్జాగూడ సమీపంలో ఆర్‌టిసి బస్సును ఢీకొన్న టిప్పర్ లక్దారం సమీపంలోని బ్యాతోల్‌లో ఉన్న ఎస్ఎంఎస్ క్వారీలోనే లోడ్ అయింది. ఓవర్ లోడ్‌తో వెళ్లే టిప్పర్లన్నీ తెల్లవారుజామునే బయలుదేరుతాయి. ఉదయం 5గంటలకు టిప్పర్లు క్వారీల నుంచి బయలుదేరి అధికారులు విధులకు రాకముందే తాము చేరాల్సిన గమ్యస్థానాలకు చేరుకుంటాయి. మిర్జాగూడ వద్ద టిప్పర్ అధిక లోడ్ ఉండటమే కాకుండా డ్రైవర్ అజాగ్రత్తగా.. అతివేగంతోపాటు నడపడంతో మూలములపు వద్ద వేగం కంట్రోల్ కాక ఆర్‌టిసి బస్సును ఎదురుగా వెళ్లి ఢీకొన్నది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. క్వారీల నుంచి టిప్పర్లలో కంకర, డస్ట్ తరలిస్తే పూర్తిగా కవర్లతో కప్పి ఉంచాలి. పరిమితికి మించి టిప్పర్‌లో లోడ్ నింపరాదు. కానీ అధికలోడ్‌తోపాటు కవర్లు కప్పకుండా.. అజాగ్రత్తగా నడుపుతూ తరచూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. వీటిని పట్టించుకోవాల్సిన ఆర్‌టిఎ, మైనింగ్ శాఖలు నిమ్మకునీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నాయి.

హైదరాబాద్‌లో నిర్మాణ రంగం భారీ స్థాయిలో కొనసాగుతున్న నేపథ్యంలో లక్దారం ప్రాంతం నుంచి వందలాది వాహనాల్లో నిత్యం తరలివెళ్తున్న కంకర, డస్ట్ లోడుతో కూడిన టిప్పర్లు(డంపర్లు) రహదారులపై మృత్యు శకటాల్లా దూసుకుపోతున్నాయి. అతివేగం, అజాగ్రత్త, ఓవర్ లోడ్‌తో నడుస్తున్న ఈ టిప్పర్ల వల్ల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ఎన్నో కుటుంబాల్లో విషాదాన్ని మిగులుస్తున్నాయి. ఆయా కుటుంబాలు రోడ్డున పడి, ఆర్థికంగా, మానసికంగా చితికిపోతున్నాయి.

గతంలో జరిగిన ప్రమాదాలు..

ఔటర్ రింగ్ రోడ్డు (ఒఆర్ఆర్)పై గండిపేట వైపు వెళ్తున్న భిక్షపతి కారును జూన్ 9వ తేదీన పాటి సమీపంలో టిప్పరు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భిక్షపతి కుమార్తె వైష్ణవి అక్కడికక్కడే మృతిచెందగా, భిక్షపతి, మరొకరు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. సదాశివపేటకు చెందిన గిరి మార్చి 21న వనస్థలిపురం వెళ్లేందుకు కారులో వెళుతూ ఓఆర్ఆర్ పైకి ఎక్కాడు. టిప్పరు ఢీకొనడంతో మృతిచెందాడు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. 2020లో మార్చిలోనూ లక్దారం గ్రామానికి చెందిన మాదన్నగారి వెంకటరామిరెడ్డి(25) బైక్‌పై వెళ్తుండగా టిప్పర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఇదే గ్రామానికి చెందిన రామిరెడ్డి(30) కూడా గతంలో టిప్పర్ ఢీకొనడంతోనే ప్రాణం కోల్పోయాడు. ఇలా లక్దారం చౌరస్తా, 65వ నంబర్ జాతీయ రహదారి, ఔటర్‌పై జరిగిన టిప్పర్ ప్రమాదాల్లో అమాయక ప్రజలు అసువులు బాసిన సంఘటనలు అనేకం. తాజాగా చేవెళ్ల సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో దాదాపు 20 మంది మృతికి కారణమైన టిప్పర్ కూడా సంగారెడ్డి జిల్లా లక్దారం సమీప గ్రామం బ్యాతోల్ నుంచే వెళ్లిందన్న సంగతి స్థానికులను తీవ్ర కలవరపాటుకు గురిచేసింది.

మెదక్ జిల్లాలోని వెల్దుర్తి మండలం ఎల్కపల్లి, బండపోసాన్పల్లిలో, మాసాయిపేట మండలం రామాంతపూర్, తూప్రాన్ మండలం ఘనపూర్‌లో మూడు, కొల్చారం మండలం రాంపూర్లో కంకర క్యారీలు ఉన్నాయి. రెండేళ్ల కిందట దీపావళి టపాసుల కోసం హెూంగార్డ్ భార్య తన ఇద్దరు చిన్నారులతో స్కూటీపై వెళుతుండగా మెదక్ కేర్ ఆస్పత్రి ఎదురుగా వెనుక నుంచి టిప్పర్ ఢీకొనడంతో వారంతా మృతిచెందారు. గతేడాది మెదక్ రాందాస్ చౌరస్తా సిగ్నల్ వద్ద నడుచుకొని వెళుతున్న వ్యక్తిని టిప్పర్ ఢీకొనడంతో మృతి చెందారు. బాలానగర్- బోధన్ జాతీయ రహదారి మెదక్ పట్టణం మీదుగా వెళ్తుండడంతో మెదక్ రోడ్ గుండా భారీ వాహనాలు వందలాదిగా ప్రయాణిస్తున్నాయి. పట్టణానికి బైపాస్ రోడ్డు లేకపోవడంతో ప్రమాదాలు అధికమయ్యాయి.

ప్రమాదంతో మేలుకున్న ఆర్‌టిఎ అధికారులు

చేవెళ్లలో జరిగిన ప్రమాదంలో ఆర్‌టిఎ అధికారులు మేలుకున్నారు. పటాన్‌చెరు ప్రాంతంలో తనిఖీలు చేపట్టి నిబంధనలు పాటించని 14 టిప్పర్లను సీజ్ చేశారు. లక్దారం, బ్యాతోల్ క్వారీల నుంచి కంకర, డస్ట్ తరలిస్తున్న వాహనాలు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఆర్‌టిఎ అధికారులు హెచ్చరించారు.

దుమ్ము ధూళితో నిత్యం ప్రమాదాలే..
సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

సంగారెడ్డి జిల్లాలో అధిక లోడ్‌తో వెళ్తున్న భారీ వాహనాలతో దుమ్ము ధూళితోపాటు నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. జిల్లాలో 131 క్వారీలు, 178 క్రషర్ల ద్వారా వేలాది వాహనాల ద్వారా రోజుకు హైదరాబాద్‌తోపాటు వివిధ ప్రాంతాలకు కంకర, రాతిపొడి, చిప్పు తరలిస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాల్లో అధిక లోడ్‌తో తరలించడం వల్ల అనేక ప్రమాదాలు జరిగాయి. రోడ్లు పాడవుతున్నాయి. విచ్చలవిడిగా తిరుగుతున్న భారీ వాహనాలపై అధికారులు చర్యలు తీసుకుని, ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి.

కరెంటోళ్ల ప్రజా బాట

- వారంలో మూడ్రోజులు క్షేత్రస్థాయికి విద్యుత్ అధికారులు
- ఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫరూఖీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వారంలో మూడు రోజులు విద్యుత్ అధికారులు "కరెంటోళ్ల ప్రజాబాట" పేరిట క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు వెళతారని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్‌పిడిసిఎల్) సిఎండి ముషారఫ్ ఫరూఖీ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం, గురువారం, శనివారం మూడు రోజుల పాటు ఉదయం 8గంటల నుంచి 10:30 గంటల వరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో సిఎండి నుంచి ఆర్టిజన్ స్థాయి వరకు ఎస్‌పిడిసిఎల్ పరిధిలో 9,500 మంది సిబ్బంది పాల్గొంటారని చెప్పారు. నేరుగా వినియోగదారులతో మాట్లాడి వారి నుండి సలహాల, సూచనలు స్వీకరిస్తారని తెలిపారు. ప్రజాబాటలో నమోదయిన ఫిర్యాదులను, సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తారని వివరించారు. ప్రజా బాటలో వేల కిలోమీటర్ల ఎల్టీ /11 కెవి, 33 కెవి లైన్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు, ఎబి స్విచ్ వంటి ఇతర విద్యుత్ పరికరాలు పరిశీలిస్తారని అన్నారు. గుర్తించిన సమస్యలు వెంటనే సాధ్యమయ్యేవి ఉంటే అప్పటికప్పుడు పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యుత్ సరఫరా నాణ్యత మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా శ్రీచైతన్య రక్తదాన శిబిరాలు

- రక్తదానం చేసిన 3,127 మంది ఉద్యోగులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశవ్యాప్తంగా శ్రీ చైతన్య ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ప్రాంగణాల్లో నిర్వహించిన శిబిరాల్లో 3,127 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. ఆ సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి 78వ జన్మదినం సందర్భంగా గురువారం రక్తదాన శిబిరాలను నిర్వహించినట్టు ఆ సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని మియాపూర్‌లో శ్రీచైతన్య క్యాంపస్‌లో సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ ప్రారంభించారు. జన్మదినం సందర్భంగా మంచి కార్యక్రమం చేపట్టినందుకు ఝాన్సీ లక్ష్మీబాయిని ఆయన అభినందించారు. రక్తదానం చేసిన ఉద్యోగులను కొనియాడారు. దేశవ్యాప్తంగా రక్తం కొరతను తీర్చేందుకు రక్తదాతలు పెద్ద ఎత్తున రావాలని పిలుపునిచ్చారు. దాతల ఆరోగ్యానికి కూడా రక్తదానం మంచిదని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి మాట్లాడుతూ ఒకవైపు విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతూ, మరోవైపు సామాజిక సేవలోనూ తమ వంతుగా పాల్గొంటున్నట్టు తెలిపారు. రక్తదానం చేసిన ఉద్యోగులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లో ఈ కార్యక్రమాన్ని వెస్ట్ జోన్ ఎజిఎం జి.రవి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ఎజిఎంలు, డీన్స్, ప్రిన్సిపల్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.